క్లుప్తంగా

జెర్రిపోతులగూడెం వాసికి డాక్టరేట్


పెండెం నరేందర్

చిలుకూరు : మండలంలోని జెర్రిపోతులగూడెం గ్రామానికి చెందిన పెండెం నరేందర్ ఉస్మానియా యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ పట్టా అందుకున్నారు. డాక్టర్ పవన్‌కుమార్ పర్యవేక్షణలో లైబ్రరీ ఇన్ఫర్మేషన్ విభాగంలో నీడ్ అండ్ ఇంపాక్ట్ ఆఫ్ కంటిన్యూయింగ్ ఎడ్యుకేషన్ ప్రోగ్రాం ఆఫ్ ఎల్‌ఐఎస్ ప్రొఫెషనల్స్ ఆఫ్ అకాడమిక్ లైబ్రరీస్ అనే అంశంపై పరిశోధన చేసినందుకు గాను తనకు డాక్టరేట్ లభించినట్లు ఆయన శనివారం స్థానిక విలేకరులకు తెలిపారు. పీహెచ్‌డీ చేసేందుకు తనకు సహకరించిన ప్రతిఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు.

సీపీఎం మండల కార్యదర్శిగా సత్యనారాయణ


సత్యనారాయణ

నడిగూడెం : సీపీఎం నడిగూడెం మండల కార్యదర్శిగా బెల్లంకొండ సత్యనారాయణ ఎన్నికయ్యారు. శుక్రవారం మండల కేంద్రంలోని సుందరయ్య భవన్‌లో జరిగిన సీపీఎం మండల మహా సభలో పార్టీ జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జునరెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యుడు మేదరమెట్ల వెంకటేశ్వరరావు, మట్టిపల్లి సైదులు సమక్షంలో ఆయనను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మరో 21 మందిని మండల కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో బెల్లంకొండ వెంకటేశ్వర్లు, కొరట్ల శ్రీనివాస్, ఏనుగుల వీరాంజనేయులు, ఎస్‌కె.లతీఫ్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

మహిళా సమాఖ్య సభ్యత్వాలు అందజేత


బేతవోలులో మహిళా సమాఖ్య సభ్యత్వాలు అందజేస్తున్న బెజవాడ వెంకటేశ్వర్లు

చిలుకూరు : మహిళలకు రక్షణ కల్పించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని సీపీఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు ఆరోపించారు. శనివారం చిలుకూరు మండలంలోని బేతవోలు గ్రామంలో మహిళా సమాఖ్య సభ్యత్వాలను ఆ సంఘం మహిళలకు అందజేసి మాట్లాడారు. కార్యక్రమంలో మహిళా సమాఖ్య నాయకురాళ్లు సాతులూరి అలివేలు, అపరాధం, నాగేంద్రమ్మ, పార్టీ నాయకులు పోరడ్ల మట్టయ్య, తాళ్లూరి పెద్ద మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

ధ్యానంతో సంపూర్ణ ఆరోగ్యం

నడిగూడెం : ధ్యానంతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ప్రముఖ ధ్యాన శిక్షణ నిపుణులు చుక్క మధు, శైలజ తెలిపారు. మండల కేంద్రంలోని శ్రీ షిర్డీ సాయి మందిరం ఆవరణలో గత 41 రోజులుగా ధ్యానంపై నిర్వహిస్తున్న శిక్షణ శనివారం ముగిసింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో మన జీవనశైలిని మరచిపోతున్నామని, ఇలాంటి సమయంలో ప్రతిఒక్కరికీ శ్వాస మీద ధ్యాస ఎంతో అవసరమన్నారు. ప్రతిఒక్కరూ సమయం ఉన్నప్పుడల్లా ధ్యానం చేసుకోవాలన్నారు. దీంతో అన్ని రకాల వ్యాధులు అదుపులో ఉంటాయన్నారు. కార్యక్రమంలో నిర్వాహకులు మోతుక్కూరి శ్రీనివాస్, కొండా ఉపేందర్, బజ్జూరి అప్పిరెడ్డి, నారాయణరెడ్డి, నల్లా శ్రీనివాసరెడ్డి, మండవ వెంకటేశ్వరరావు, అనంతుల కృష్ణయ్య, దేవరంగుల వీరన్న, బెల్లంకొండ సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

దాడులు చేయడం సమంజసం కాదు

గరిడేపల్లి : దళితబంధు పథకం రెండో విడత నిధులు మంజూరు చేయాలంటూ హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి దళితులతో కలిసి శాంతియుతంగా నిరసన వ్యక్తం చేస్తుంటే పోలీసులు దాడి చేసి అరెస్టు చేయడం సమంజసం కాదని బీఆర్‌ఎస్ మండల అధికార ప్రతినిధి రామ్ సైదులు అన్నారు. శనివారం మండల కేంద్రంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిరంకుశ పాలనకు ఇది నిదర్శమని అన్నారు. దళితులపై ముఖ్యమంత్రి సవతి తల్లి ప్రేమ చూపించకుండా వెంటనే దళిత బంధు రెండో విడత నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు రాపోలు నవీన్, పల్లెపంగు నాగరాజు, పెరుమాళ్ల సతీష్, ఇంతియాజ్, రామ్‌మధు, అంజి తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర వేతన చట్టం అమలులో విఫలం

హుజూర్‌నగర్‌రూరల్ : అసంఘటిత రంగంలో పనిచేస్తున్న కార్మికులకు సమగ్ర వేతన చట్టం అమలు చేయడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని టీఎస్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శీతల రోషపతి అన్నారు. శనివారం వేపలసింగారంలో గ్రామీణ హమాలీల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వ్యాపారస్తులు హమాలీలకు ఎగుమతి, దిగుమతి రేట్లు, అలవెన్స్‌లు పెంచాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఆ సంఘం నాయకులు కొండలు, మల్లయ్య, బ్రహ్మం, రవి, పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు విస్తరణకు గ్రీన్ సిగ్నల్

- అనంతగిరి రహదారిని 10 అడుగుల మేర విస్తరించేందుకు ప్రణాళిక
- త్వరలో ప్రారంభం కానున్న పనులు
- ఇరవై గ్రామాల ప్రజలకు తప్పనున్న తిప్పలు.. నయానగర్‌కు విముక్తి


ఆక్రమణలతో ఇరుకుగా మారిన అనంతగిరి రోడ్డు

కోదాడ : అది అసలే ఇరుకు రహదారి. ఆపై ఇరువైపులా ఆక్రమణలు. దీంతో రోడ్డు గుండా నిత్యం ప్రయాణించే అనంతగిరి, నడిగూడెం మండలాలకు చెందిన ఇరవై గ్రామాల ప్రజలు నిత్యం నరకం అనుభవిస్తున్నారు. వీరితో పాటు నయానగర్ నుంచి ప్రధాన రహదారికి వచ్చే పట్టణవాసులు ట్రాఫిక్ సమస్యతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వీటన్నిటికి చరమగీతం పాడుతూ ఈ రోడ్డు విస్తరణ పనులను యుద్ధప్రాతిపదికన చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. నాలుగు రోజుల క్రితం కోదాడలో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన సమీక్షా సమావేశంలో అనంతగిరి రోడ్డు విస్తరణ పనులను వెంటనే చేపట్టాలని ఆర్ అండ్‌బీ అధికారులను ఆదేశించారు. దీంతో రోడ్డు విస్తరణ పనులకు త్వరలోనే మోక్షం లభించనుండడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఇరవై ఏళ్లుగా డిమాండ్..

కోదాడ పట్టణంలో జాతీయ రహదారి నుంచి నయానగర్ మీదుగా అనంతగిరికి రహదారి ఉంది. 30 అడుగుల వెడల్పు ఉన్న ఈ రహదారి నుంచే అనంతగిరి, నడిగూడెం మండలాలకు చెందిన 20 గ్రామాల ప్రజలతో పాటు నయానగర్ ప్రజలు నిత్యం రాకపోకలు సాగిస్తున్నారు. అయితే ఈ రహదారిలో నాగార్జున లాడ్జి నుంచి పబ్లిక్ క్లబ్ వరకు ఇరువైపులా వ్యాపార సముదాయాలు విస్తరించడంతో పాటు ఇరువైపులా ఆక్రమణలు పెరగడంతో ఈ రోడ్డుపై వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందిగా మారింది. ఇదే రహదారి నుంచి రెండు ఇంజనీరింగ్ కళాశాలలకు చెందిన 50కి పైగా బస్సులు రాకపోకలు సాగిస్తుండడంతో ఉదయం, సాయంత్రం తీవ్ర ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోంది. దీంతో పాటు ఇక్కడ ఉన్న దుకాణాలకు వచ్చే వారు తమ వాహనాలను రోడ్డు మీదే నిలుపుతున్నారు.

ఇరువైపులా 10 అడుగుల విస్తరణ..

నాగార్జున లాడ్జి నుంచి కోదాడ పబ్లిక్ క్లబ్ వరకు ప్రస్తుతం ఉన్న రోడ్డును ఇరువైపులా 10 అడుగుల మేర విస్తరించనున్నారు. దీని కోసం 14 భవనాలను పాక్షికంగా తొలగించి బాధితులకు నష్ట పరిహారం చెల్లించనున్నారు. పబ్లిక్ క్లబ్ నుంచి అనంతగిరి వరకు ఇరువైపులా 10 అడుగుల మేర విస్తరించనున్నారు. మాజీ ఎమ్మెల్యే వేనేపల్లి చందర్‌రావుకు చెందిన నాగార్జున లాడ్జిలో ఒక దుకాణం మేర తొలగించే అవకాశం ఉంది. కాంగ్రెస్ నాయకుడు లక్ష్మీనారాయణరెడ్డి నివాసాన్ని కూడా పాక్షికంగా తొలగించే అవకాశం ఉంది. రోడ్డు విస్తరణ కోసం తమ భవనాలను తొలగించడానికి ఎలాంటి అభ్యంతరం లేదని గతంలో వీరు ప్రకటించిన విషయం విదితమే. వీరితో పాటు మరో 12 భవనాల ముందుభాగం తొలగించే అవకాశం ఉంది.

మరో రెండు రోడ్లను కూడా విస్తరించాలి



అనంతగిరి రోడ్డు విస్తరణ పనులు చేపట్టాలని నిర్ణయించడం అభినందనీయం. ఈ రోడ్డు విస్తరణతో ప్రజలు ఇబ్బందులు తొలగుతాయి. దీంతో పాటు నయానగర్‌లో ఎస్వీ కళాశాల రోడ్డు, కోర్టు వద్ద ఉన్న ఎస్‌ఎస్‌పీ రోడ్డును కూడా అభినవ్ వీధికి కలిపే విధంగా విస్తరించాలి. పట్టణంలో ప్రతి రోడ్డుకు ఆర్చీలు కట్టి, వాటి వెంట డబ్బా కొట్లను ఏర్పాటు చేశారు. దీంతో మూల మలుపుల్లో తీవ్ర ఇబ్బందిగా ఉంది. వీటిని కూడా తొలగించాలి.

– పొడుగు హుస్సేన్, సామాజిక కార్యకర్త, కోదాడ

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

- సీనియర్ సివిల్ జడ్జి సురేష్


ర్యాలీలో పాల్గొన్న జడ్జి సురేష్, న్యాయవాదులు

కోదాడరూరల్ : చట్టాలపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని కోదాడ సీనియర్ సివిల్ జడ్జి, మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ కె.సురేష్ అన్నారు. జాతీయ న్యాయ సేవా దినోత్సవం సందర్భంగా శనివారం కోదాడ పట్టణంలో మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో జడ్జి మాట్లాడారు. న్యాయ సేవాధికార సంస్థ అందించే న్యాయ సహాయాన్ని అవసరమున్న వారు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ చిత్తలూరి సత్యనారాయణ, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్‌ఆర్‌కే మూర్తి, చింతకుంట్ల రాంరెడ్డి, మేకల వెంకట్రావ్, పాలేటి నాగేశ్వరరావు, ఈదుల కృష్ణయ్య, కత్తి హరిప్రసాద్ తదితరులు ఉన్నారు.

వేతనాల కోసం పారిశుద్ధ్య కార్మికుల ధర్నా


మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న పారిశుద్ధ్య కార్మికులు

కోదాడ: ఆరు నెలలుగా తమకు వేతనాలు ఇవ్వడం లేదని 70 మంది పారిశుద్ధ్య సిబ్బంది శనివారం విధులు బహిష్కరించి కోదాడ మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వేతనాల విషయమై అధికారులు, ప్రజాప్రతినిధులకు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తమకు వెంటనే వేతనాలు ఇవ్వకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

గతంలో వీరి నుంచి డబ్బులు వసూలు..

గత ప్రభుత్వ హయాంలో కోదాడ మున్సిపల్ చైర్మన్‌గా వనపర్తి శిరీష ఉన్న సమయంలో మాజీ ఎమ్మెల్యే సూచనతో వార్డుకు ఇద్దరు చొప్పున 70 మంది పారిశుద్ధ్య కార్మికులను నియమించారు. ఇదే అదునుగా పలువురు కౌన్సిలర్లు ఉద్యోగాలు ఇస్తామని ఒక్కొక్కరి నుంచి రూ.లక్ష వసూలు చేశారు. ఇది పెద్ద వివాదంగా మారడంతో నియామకాలను అధికారికంగా నిలిపివేశారు. అప్పటికే పలువురు కార్మికులు విధుల్లో చేరారు. వీరు తాము కాంట్రాక్ట్ కార్మికులమని భావించారు. కానీ మున్సిపల్ ఉన్నతాధికారులు కూడా వీరి నియామకానికి ఆమోదం తెలపకుండా మున్సిపాలిటీ సాధారణ నిధుల నుంచి దినసరి కూలీలుగా వేతనాలు చెల్లిస్తున్నారు. ఈ విషయాన్ని తాజా ధర్నాలో మున్సిపల్ అధికారులు బయట పెట్టారు. నాడు ఉద్యోగాల పేరుతో లక్షలు వసూలు చేసిన నేతలు ముఖం చాటేస్తున్నట్లు సమాచారం.

బేతవోలులో శాలివాహన వన మహోత్సవం


ఊరేగింపులో పాల్గొన్న శాలివాహన కులస్తులు

చిలుకూరు : కార్తీక మాసం సందర్భంగా చిలుకూరు మండలంలోని బేతవోలు గ్రామంలో శనివారం శాలివాహన కులస్తులు వన మహోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా కుమ్మరి చక్రం, శివలింగంతో గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం గ్రామ సమీపంలో గల తోటలో వారంతా వన భోజనాలకు వెళ్లారు. ఈ కార్యక్రమంలో శాలివాహన కులపెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

మాదిగ ద్రోహిగా వ్యవహరిస్తున్న రేవంత్‌రెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న చిప్పలపల్లి సోమశేఖర్

కోదాడరూరల్ : ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు తీర్పును రాష్ట్రంలో అమలు చేయకుండా సీఎం రేవంత్‌రెడ్డి మాదిగ ద్రోహిగా వ్యవహరిస్తున్నారని ఎంఎస్‌ఎఫ్ జాతీయ అధ్యక్షుడు చిప్పలపల్లి సోమశేఖర్ మాదిగ అన్నారు. శనివారం కోదాడ పట్టణంలోని ఓ కళాశాలలో నిర్వహించిన ఎంఎస్‌ఎఫ్ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. వర్గీకరణపై సుప్రీం కోర్టు తీర్పు వచ్చి నాలుగు నెలలవుతున్న రాష్ట్రంలో అమలు చేయకుండా కాలక్షేపం చేస్తుండటంతో విద్యా, ఉద్యోగ రంగాల్లో మాదిగ, ఉపకులాలకు అన్యాయం జరుగుతుందన్నారు. రేవంత్‌రెడ్డికి మాదిగ సత్తా ఏంటో చూపించి వర్గీకరణ అమలు చేసుకొని తీరుతామని తెలిపారు. నల్లగొండలోని మహాత్మాగాంధీ యూనివర్సిటీలో ఈ నెల చివరి వారంలో నిర్వహించబోయే ఉమ్మడి జిల్లా మాదిగ విద్యార్థుల మహాసభకు విద్యార్థులు వేలాదిగా హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం నియోజకవర్గ ఎంఎస్‌ఎఫ్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఇన్‌చార్జ్‌గా రాయల తరుణ్‌మాదిగ, కోఇన్‌చార్జ్‌గా గుండెపంగు త్రినాథ్, మండల కమిటీలను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఎంఎస్‌ఎఫ్ జిల్లా కన్వీనర్ పందింటి నవీన్‌మాదిగ, జిల్లా అధికార ప్రతినిధి ఏపూరి రాజుమాదిగ, కొండపల్లి అంజయ్య మాదిగ, యలమర్తి రాము మాదిగ, ఏపూరి సత్యరాజు మాదిగ తదితరులు ఉన్నారు.

నారసింహునికి గరుడవాహన సేవ


ఆలయ తిరుమాడ వీధుల్లో గరుడ వాహనంపై ఊరేగుతున్న స్వామివారు

మఠంపల్లి : మట్టపల్లి శ్రీలక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో శ్రీరాజ్యలక్ష్మి చెంచులక్ష్మి సమేత శ్రీ ప్రహ్లాద యోగానంద శ్రీలక్ష్మీనరసింహస్వామి నిత్య కల్యాణాన్ని అర్చకులు శనివారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో సుప్రభాతసేవ, నిత్యహోమం, మూలవిరాట్ స్వామికి పంచసూక్త విధానంగా పంచామృతాభిషేకం, ప్రత్యేక అర్చనలు చేశారు. అనంతరం నూతన పట్టు వస్త్రాలతో స్వామివారిని, అమ్మవార్లను అందంగా అలంకరించి ఎదుర్కోళ్ల మహోత్సవ సంవాదం రక్తికట్టించారు. కల్యాణ తంతులో భాగంగా విష్వక్సేనారాధన, పుణ్యాహవచనం, రుత్విగ్వరణం, రక్షాబంధనం, మధుపర్కపూజ, మాంగల్యధారణ, తలంబ్రాల మహోత్సవాన్ని నిర్వహించారు. స్వామి అమ్మవార్లను గరుడ వాహనంపై ఆలయ తిరుమాడ వీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు విజయ్‌కుమార్, మట్టపల్లి రావు, ఈఓ నవీన్‌కుమార్, అర్చకులు రామాచార్యులు, పద్మనాభాచార్యులు, లక్ష్మీనరసింహమూర్తి, అంజనేయాచార్యులు, భక్తులు పాల్గొన్నారు.

మైనార్టీ గురుకులంలో ఉర్దూ దినోత్సవం


ఉర్దూ అక్షరాల ఆకారంలో కూర్చొన్న విద్యార్థులు

హుజూర్‌నగర్ : పట్టణంలోని మైనారిటీ గురుకుల పాఠశాలలో శనివారం ఉర్దూ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉర్దూ అక్షరాల ఆకారంలో కూర్చొని ప్రదర్శన నిర్వహించారు. ఉర్దూ మీడియంలో విద్యార్థులకు వ్యాస రచన పోటీలు నిర్వహించారు. అనంతరం ఉర్దూ టీచర్లు ఫర్హాత్, సబీహా, నుస్రత్‌లను సన్మానించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రెహానా బేగం, ఉపాధ్యాయినులు విద్యార్థులు పాల్గొన్నారు.

ఓటరు నమోదు ప్రక్రియ ప్రారంభం


ఓటరు నమోదు ప్రక్రియను పరిశీలిస్తున్న తహసీల్దార్ ఆంజనేయులు

మునగాల : మండల వ్యాప్తంగా నూతన ఓటరు నమోదు ప్రక్రియను ప్రారంభించినట్లు తహసీల్దార్ వి.ఆంజనేయులు తెలిపారు. శనివారం మండల కేంద్రంలోని పోలింగ్ కేంద్రంలో స్పెషల్ క్యాంపస్ డే నిర్వహించి చేపట్టిన ఓటరు నమోదు ప్రక్రియను ఆయన పరిశీలించి మాట్లాడారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో బీఎల్‌ఓలు స్పెషల్ క్యాంపస్ డేను ఏర్పాటు చేయాలన్నారు. 18 ఏళ్ల నిండిన యువత ఓటు నమోదు చేసుకునేలా బీఎల్‌ఓలు ప్రోత్సహించాలని సూచించారు. ఆర్‌ఐ రామారావు ఉన్నారు.

శ్రమకు తగ్గ కూలి ఇవ్వాలి

హుజూర్‌నగర్ : రైస్ మిల్లుల్లో పనిచేసే దినసరి కూలీలకు శ్రమకు తగ్గ కూలి ఇవ్వాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు శీలం శ్రీను కోరారు. ఈమేరకు శనివారం రైస్ మిల్లర్స్ అసోసియేషన్ భవనంలో అధ్యక్షుడు లక్ష్మీనరసింహారావు, గౌరవ సలహాదారులు జి.అప్పారావు, జి.ప్రభాకర్ రావులకు వినతిపత్రం అందజేసి మాట్లాడారు. కూలీలకు అలవెన్స్‌లు పెంచాలని కోరారు. సంఘం నాయకులు పర్వతాలు, లాలయ్య, తిరపయ్య, వెంకటమ్మ, మంగమ్మ, లింగమ్మ, రాధా, సునీత, పద్మ పాల్గొన్నారు.

సర్వేను బాధ్యతాయుతంగా నిర్వహించాలి


మోతె : శిక్షణలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ రాంబాబు


మునగాల : ఎన్యుమరేటర్ల శిక్షణ సదస్సులో మాట్లాడుతున్న డిప్యూటీ సీఈఓ శిరీష

మోతె : సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేను ఎన్యుమరేటర్లు బాధ్యతాయుతంగా నిర్వహించాలని జిల్లా అదనపు కలెక్టర్ పి.రాంబాబు అన్నారు. శనివారం మోతె మండల కేంద్రంలో గల శ్రీశక్తి భవనంలో ఎన్యుమరేటర్లకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమానికి హాజరై పలు సూచనలు చేశారు. అనంతరం స్థానికంగా సమగ్ర కుటుంబ సర్వేను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్వే ఫారాల్లో స్టార్ మార్కు ఉన్న చోట కోడ్ నంబర్లు రాయాలన్నారు. ఈ సర్వేలో 80 శాతం కోడ్ నంబర్లు, 20 శాతం రాత పని ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సంఘమిత్ర, ఏఓ అరుణ, ఆర్‌ఐలు, సూపర్‌వైజర్లు, ఎన్యుమరేటర్లు పాల్గొన్నారు.

సర్వేకు ప్రజలు సహకరించాలి

మునగాల : సమగ్ర కుటుంబ సర్వేకు ప్రజలు సహకరించాలని డిప్యూటీ సీఈఓ, మండల ప్రత్యేక అధికారి శిరీష కోరారు. శనివారం మునగాల ఎంపీడీఓ కార్యాలయంలో ఎన్యుమరేటర్లకు రెండవ సారి జిల్లా మాస్టర్ ట్రైనర్ రమేష్ శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా శిరీష మాట్లాడుతూ.. మండల వ్యాప్తంగా 110 మంది ఎన్యుమరేటర్లను నియమించినట్లు తెలిపారు. సర్వే వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో పొందపరచనున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో తహసీల్దార్ వి.ఆంజనేయులు, ఎంపీడీఓ కె.రమేష్ దీనదయాళ్, డిప్యూటీ తహసీల్దార్ సత్యనారాయణ, ఆర్‌ఐ ఎస్.రామారావు, ఎంపీఓ దార శ్రీనివాస్, ఏపీఓ శైలజ, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

తప్పులు లేకుండా వివరాలు సేకరించాలి

నేరేడుచర్ల : సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేలో ఎన్యూమరేటర్లు తప్పులు లేకుండా వివరాలు సేకరించాలని తహసీల్దార్ సురిగి సైదులు అన్నారు. శనివారం నేరేడుచర్ల మండలంలోని జగన్నాథతండాలో ఇంటింటి కుటుంబ సమగ్ర సర్వేను ఆయన పరిశీలించి మాట్లాడారు. ఎన్యూమరేటర్‌కు కేటాయించిన బ్లాక్‌లో 175 కంటే ఎక్కువ గృహాలుంటే వాటికి బై నంబర్లు ఇవ్వాలన్నారు. ఆయన వెంట సీనియర్ అసిస్టెంట్ అబ్బాస్, సూపర్‌వైజర్లు, ఎన్యూమరేటర్లు ఉన్నారు.

సామాజిక సర్వేను జయప్రదం చేయాలి

నడిగూడెం : మండల వ్యాప్తంగా నిర్వహిస్తున్న సామాజిక, ఆర్థిక, రాజకీయ, కుటుంబ సర్వేను విజయవంతం చేయాలని తహసీల్దార్ వి.సరిత కోరారు. శనివారం మండల కేంద్రంలోని రైతు వేదికలో ఎన్యూమరేటర్లు, సూపర్‌వైజర్లకు నిర్వహించిన శిక్షణ ముగింపు కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. సమావేశంలో ఎంపీడీఓ ఎస్‌డీ.ఇమామ్, ఎంపీఓ విజయ కుమారి, తదితరులు పాల్గొన్నారు.

ఎత్తిపోతల పథకాల్లో పాత సిబ్బందినే క్రమబద్ధీకరించాలి


మాట్లాడుతున్న మేదరమెట్ల వెంకటేశ్వరరావు

మునగాల : సాగర్ ఎడమ కాలువపై ఉన్న ఎత్తిపోతల పథకాల్లో నూతనంగా లస్కర్లు, హెల్పర్లు తదితర సిబ్బంది నియామకాన్ని స్వాగతిస్తున్నామని, కానీ ఎన్నో ఏళ్లుగా ఎత్తిపోతల పథకాల్లో విధులు నిర్వర్తిస్తున్న సిబ్బందిని విస్మరించడం సమంజసం కాదని, పాతవారినే క్రమబద్ధీకరించాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు, కొక్కిరేణి ఎత్తిపోతల పథకం చైర్మన్ మేదరమెట్ల వెంకటేశ్వరరావు కోరారు. శనివారం మండలంలోని కొక్కిరేణిలో సీపీఎం సీనియర్ నాయకులు ములకలపల్లి సైదులు అధ్యక్షతన జరిగిన సీపీఎం గ్రామ శాఖ సమావేశంలో వారు మాట్లాడారు. ఈ సమావేశంలో గ్రామ శాఖ కార్యదర్శి నందిగామ సైదులు, మండల కమిటీ సభ్యులు రేఖ లింగయ్య, రావుల పెంట బ్రహ్మం, ములకలపల్లి నాగరాజు, గురుమూర్తి, శేషగిరి, సైదులు, వెంకన్న, శంభయ్య, హుస్సేన్, ప్రసాద్, నారాయణ పాల్గొన్నారు.

కేసీఆర్ ఆనవాళ్లు చెరిపే సత్తా సీఎంకు లేదు

నేరేడుచర్ల : తన ప్రాణాలను కూడా లెక్క చేయకుండా రాష్ట్రాన్ని సాధించిన తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ ఆనవాళ్లు చెరిపే సత్తా సీఎం రేవంత్‌రెడ్డికి లేదని బీఆర్‌ఎస్ పార్టీ విద్యార్థి విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు పల్లెపంగ నాగరాజు అన్నారు. శనివారం నేరేడుచర్లలోని సోషల్ మీడియా కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేసీఆర్ రాష్ట్రాన్ని దేశంలోనే నంబర్–1 స్థానంలో నిలిపారని అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీల అమలులో పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. రైతులకు ఇబ్బందులు లేకుండా ధాన్యం కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో బీఆర్‌ఎస్ నియోజకవర్గ అధికార ప్రతినిధి పసుపులేని నర్సింహారావు, సోషల్ మీడియా ఇన్‌చార్జ్ నాగార్జున, ఎస్టీ సెల్ అధ్యక్షుడు శ్రీనునాయక్, బచ్చలకూరి నాగశేఖర్, వాసు, నాగయ్య, నరేష్ తదితరులు ఉన్నారు.

వరి కొయ్యలను కాల్చొద్దు

నడిగూడెం : రైతులు వరి కొయ్యలను కాల్చొద్దని మండల వ్యవసాయాధికారి రాయపు దేవప్రసాద్ శనివారం ఒక ప్రకటనలో కోరారు. వరి కొయ్యకాలను కాల్చడం వలన నేలలో సూక్ష్మ జీవులు చనిపోతాయని తద్వారా నేల సారం దెబ్బతింటుందని తెలిపారు. వరి కొయ్యలను నిప్పుపెడితే వాయు కాలుష్యం ఏర్పడుతుందని తెలిపారు.

12 నుంచి బూరుగడ్డలో పవిత్రోత్సవాలు

హుజూర్‌నగర్‌రూరల్ : మండలంలోని బూరుగడ్డలో గల శ్రీ శాల్మలీకంద, ఆదివరాహ, లక్ష్మీనరసింహ, వేణుగోపాలస్వామి దేవాలయంలో ఈనెల 12వ తేదీ సాయంత్రం నుంచి 15 వరకు పవిత్రోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ చైర్మన్ యరగాని గురువయ్య గౌడ్, ఈఓ ఎంపీ లక్ష్మణ్‌రావు తెలిపారు. శనివారం స్థానికంగా వారు విలేకరులతో మాట్లాడారు. యజ్ఞకర్త ముదుంబై పవనకుమారాచార్యులు ఆధ్వర్యంలో ఈ పవిత్రోత్సవాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. 12న విష్వక్సేనారాధన, పుణ్యాహవచనం, రక్షాభందనం, మత్స్యగ్రహణం, అంకురార్పణ, 13న ఆరాధన, బాలభోగం, యాగశాల ప్రవేశం, ధ్వజకుంబారాధన, అగ్నిప్రతిష్ఠ, మూలమంత్ర హోమం, నిత్యపూర్ణాహుతి, 14న నిత్యపూజలు, శతకలశ స్నాపన, పవిత్రారోపణం, 15న ఆరాధనసేవాకాలం, బాలభోగం, హోమం, పూర్ణాహుతి, పవిత్రముల వితరణ, పందిత సన్మానం, తీర్థప్రసాదాల పంపిణీ ఉంటుందని తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆయన కోరారు.

మొల్లమాంబ విగ్రహ దిమ్మె కూల్చడం హేయమైన చర్య

కోదాడరూరల్ : నల్లగొండ జిల్లా హాలియాలో నిర్మించిన తెలుగు మహిళా కవయిత్రి మొల్లమాంబ విగ్రహ దిమ్మెను మున్సిపల్ సిబ్బంది కూల్చడం హేయమైన చర్య అని మట్టపల్లి కుమ్మరి అన్నదాన సత్రం అధ్యక్షుడు మామిడి రామారావు అన్నారు. శనివారం కోదాడ పట్టణంలోని పబ్లిక్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దిమ్మె కూల్చడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. దిమ్మె కూల్చిన మున్సిపల్ అధికారులను వెంటనే సస్పెండ్ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రామారావు, చలిగంటి ప్రసాద్, చలిగంటి దామోదర్, వెంకట్, నర్సయ్య, రామకృష్ణ, నాగరాజు, నరేష్, రంగా, శివ ఉన్నారు.

అయ్యప్ప ఆలయంలో అన్నదానం

మునగాల : మండల కేంద్రం శివారులోని అయ్యప్ప ఆలయం ఆవరణలో గల అన్నదాన వితరణ కేంద్రంలో శనివారం 230 మంది అయ్యప్ప మాలధారులకు అన్నదానం నిర్వహించినట్లు ఆలయ కమిటీ చైర్మన్ తడకమళ్ల శ్రీను గురుస్వామి తెలిపారు. ఈ అన్నదానానికి చింతలపాలెం మండలం మల్లారెడ్డిగూడెం గ్రామానికి చెందిన చిత్తలూరి రవితేజ, కోదాడకు చెందిన చిత్తలూరి గోపి, సూర్యాపేటకు చెందిన వల్లపు సోమయ్య –మంజుల దంపతులు, తాటికొండ వెంకటమ్మ, ఎన్టీఆర్ జిల్లా పెనుగంచిప్రోలుకు చెందిన షేక్ రహీం మొహరున్నీసా, కోదాడ మండలం కాపుగల్లుకు చెందిన షేక్ అమీనాబేగం సహకరించినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో గురుస్వాములు పెంటకొట్టు సురేష్, కొమ్ము ఈదారావు, బొబ్బిలి సంజీవరెడ్డి, ఐడియా బ్రహ్మం, ముంత లింగయ్య, తంగెళ్ల సాంబశివరావు, మాలధారులు పాల్గొన్నారు.

నేడు కార్తీక మాస వనభోజనాలు

కోదాడరూరల్ : మండలంలోని దోరకుంట సమీపంలోని తోటలో ఆదివారం కాకతీయ కమ్మ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కార్తీక వన భోజనాల కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆ సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు ఏర్నేని బాబు పిలుపునిచ్చారు. శనివారం వన భోజన స్థలాన్ని ఆయన పరిశీలించి మాట్లాడారు. కోదాడ నియోజకవర్గంతో పాటు మేళ్లచెరువు మండలంలోని కమ్మ కుటుంబ సభ్యులను ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు.

సోమలింగేశ్వరస్వామికి రుద్రాభిషేకం

హుజూర్‌నగర్ : కార్తీక మాసం సందర్భంగా హుజూర్‌నగర్‌లోని శ్రీకనకదుర్గ ఆలయ ప్రాంగణంలో ఉన్న శ్రీసంతాన సోమలింగేశ్వర స్వామికి శనివారం మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో ఫల్గుణశర్మ, కొండయ్య, ఆకుల రాము, ఉపేందర్, సూర్యనారాయణ, వెంకటేశ్వర్లు, రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మత్స్య సొసైటీలు సద్వినియోగం చేసుకోవాలి

గరిడేపల్లి : ప్రభుత్వం అందించే ఉచిత చేప పిల్లలను మత్స్య సొసైటీ సభ్యులు సద్విని యోగం చేసుకోవాలని టీడీపీ మండల అధ్యక్షులు కీసరి నాగయ్య అన్నారు. శనివారం మండల కేంద్రంలోని తాళ్లచెరువు, రాగి చెరువుల్లో చేప పిల్లలను వదిలి మాట్లాడారు. కీసరి వెంకటి, కీసరి బక్కయ్య, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

దేశవ్యాప్తంగా కులగణన చేపట్టాలి

గరిడేపల్లి : దేశవ్యాప్తంగా కేంద్ర ప్రభుత్వం చేపట్టబోయే జనగణనలో కులగణన కూడా చేపట్టాలని బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దూళిపాళ ధనుంజయనాయుడు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం గరిడేపల్లిలో ఆయన విలేకరులతో మాట్లాడారు.

'నాణ్యత లేని చేప పిల్లలు పంపిణీ'

నేరేడుచర్ల : రాష్ట్ర ప్రభుత్వం మత్స్య సొసైటీలకు నాణ్యత లేని చేపపిల్లలు పంపిణీ చేస్తోందని, ఇందుకు కారణమైన చేప పిల్లల కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని జిల్లా మత్స్య సహకార సంఘం ప్రమోటర్ పేరబోయిన వీరయ్య అన్నారు. శనివారం నేరేడుచర్లలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సొసైటీలకు అప్పుడే పుట్టిన చేపపిల్లలను అందిస్తున్నారని, 10 వేల చేప పిల్లలు అందించాల్సి ఉండగా వెయ్యి మాత్రమే అందిస్తూ మోసం చేస్తున్నారని ఆరోపించారు. మత్స్య సొసైటీలు సొంతంగా కొనుగోలు చేసుకునే చేప పిల్లలు బాగున్నాయని ఆయన తెలిపారు. మంచి చేప పిల్లలను సరఫరా చేయాలని ఆయన కోరారు.